క్లుప్తంగా

నీటి పొదుపు అందరి బాధ్యత



బురాన్‌దొడ్డిలో నీటి కుంటను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: నీటి పొదుపును అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. తాగునీటి బోర్లు, బావులు, నీటి వనరులను పరిశీలించారు. బురాన్‌దొడ్డిలో గ్రామస్తులకు సరఫరా చేసే మంచినీటి బావిని పరిశీలించి, అక్కడి వారితో మాట్లాడారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సూచించారు. నీటి కలుషితం వల్లే ఎక్కువగా వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ఆయన వెంట బురాన్‌దొడ్డి సర్పంచ్ రామాంజనేయులు ఉన్నారు.

డ్రాపౌట్స్ లేకుండా చూడాలి



విద్యార్థినికి బ్యాగు అందిస్తున్న పీఓ రవీంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ లేకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం నెరావడమెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలకల పాఠశాలలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన పాఠశాలలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రతి గదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెరుగైన విద్యాబోధన, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. తరగతి, వంట గదులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి విద్యా ప్రమాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ మేరీ సలోమి పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

పాణ్యం: రేషన్ కార్డుదారులకు మంగళవారం నుంచి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి బియ్యంతో పాటు జొన్నలు అందించనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లకుండా వాహనాల వద్ద తీసుకోవాలని సూచించారు.

బ్యాడ్మింటన్‌లో విద్యార్థి ప్రతిభ



సందీప్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

పాణ్యం: మండల పరిధిలోని నెరావడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విద్యార్థి సందీప్‌కుమార్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. గత నెల 28, 30 తేదీల్లో నంది ఇండోర్ స్టేడియంలో అండర్–19 బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. చెర్మన్ శాంతిరామ్ రాముడు, డైరెక్టర్ శివరామ్ అభినందించారు.

నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలి



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ

కోడుమూరు రూరల్: వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులనే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ దుకాణదారులను ఆదేశించారు. సోమవారం కోడుమూరులోని విత్తన, ఎరువుల దుకాణాల్లో ఏఓ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు గుర్తింపు ఉన్న కంపెనీ విత్తనాలు, ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని తెలిపారు. విత్తన కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. అనుమతి లేని విత్తనాలు, మందులు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

పింఛన్.. పరేషాన్

- ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీకి తూట్లు
- పలు చోట్ల సచివాలయాలు, ఆలయాల వద్ద పంపిణీ
- ఉదయం 8 గంటలకే సర్వర్ సమస్యలు
- లబ్ధిదారులకు తప్పని పడిగాపులు
- టీడీపీ నాయకుల హంగామా

ఐదేళ్ల పాటు ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు అందుకున్న లబ్ధిదారులకు ఈ నెల ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇంటి వద్దకే పింఛన్లు వస్తాయని ఎదురుచూసిన లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్లారు. పలు గ్రామాల్లో సచివాలయాలు, ఆలయాల వద్దకు వచ్చి తీసుకోవాలని చెప్పడంతో అవస్థలు పడుతూ అక్కడి చేరుకున్నారు. తీరా సర్వర్ సమస్యలు తలెత్తడంతో గంటల తరబడి అక్కడే ఎదురుచూశారు. మరి కొన్ని చోట్ల సచివాలయ సిబ్బందిని పక్కనపెట్టి టీడీపీ నాయకులే పింఛన్లు పంచుతూ పార్టీ కార్యక్రమంగా మార్చేశారు.



కొత్తకోటలో దేవాలయం వద్ద పింఛన్ల కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు

సి.బెళగల్: మండలంలో సోమవారం ఉదయం పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా 8 గంటల అనంతరం సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ముడుమాల, కొత్తకోట తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్ల దగ్గర కాకుండా సచివాలయాల్లో నగదు పంచుతామని తెలపడంతో వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడుతూ సచివాలయాలకు చేరుకున్నారు. అయితే అక్కడ కూడా సర్వర్ పనిచేయకపోవడంతో నిరాశతో ఇంటి ముఖం పట్టారు. మండల కేంద్రం సి.బెళగల్ పాటు మరికొన్ని గ్రామాల్లో దేవాలయాల వద్దకు పిలుపించుకున్న టీడీపీ నాయకులు అక్కడే పింఛన్లు పంపిణీ చేశారు. కొందరు టీడీపీ నాయకులు ఎలాంటి హోదా లేకపోయినా పింఛన్లు పంచుతూ ప్రచారం చేసుకున్నారు. కాగా మండంలో మొదటి రోజు 6,627 (90.37 శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శకుంతల తెలిపారు.

కల్లూరు 92శాతం పంపిణీ

కల్లూరు: మండలంలోని ఎన్టీఆర్ భరసా పింఛన్ల పంపిణీ సోమవారం సాయంత్రానికి 92శాతం అయిందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వివిధ గ్రామాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు.

ప్రచారానికే ప్రాధాన్యం

ఓర్వకల్లు: ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా మండలంలో టీడీపీ నాయకులు ప్రచారం కోసం లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేశారు. నన్నూరు, తిప్పాయపల్లె, బ్రాహ్మణపల్లె తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే గౌరు చరిత పింఛన్లు పంపిణీ చేశారు. చాలా చోట్ల సచివాలయ ఉద్యోగులను కాదని టీడీపీ నాయకులే పంపిణీ చేస్తూ హడావుడి చేశారు. మండలంలో 7,777 మంది లబ్ధిదారులు ఉండగా 94.13 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మల్లీశ్వరి తెలిపారు.

ఇళ్ల వద్దే పంపిణీ చేయాలి

గూడూరు రూరల్: సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని మండల ప్రత్యేక అధికారి సునీల్ కన్నా అన్నారు. కె.నాగలాపురం, గుడిపాడు, జూలకల్ గ్రామాల్లో ఎంపీడీఓ విజయసింహారెడ్డితో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు.

టీడీపీ నాయకుల హంగామా

మండలంలోని ఆయా గ్రామాల్లో పింఛన్ల పంపిణీని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది చేపట్టాల్సి ఉండగా వారితో టీడీపీ నాయకులు కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్ అందించారు. గూడూరు పట్టణంతో పాటు బూడిదపాడు, కె.నాగలాపురం, పెంచికలపాడు, గుడిపాడు, చనుగొండ్ల, జూలకల్, మునగాల, ఆర్.ఖానాపురంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలిసి టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పింఛన్‌ను అందించారు.



ముడుమాల సచివాయలంలో సర్వర్ మొరాయించడంతో వెనుదిరుగుతున్న పింఛన్‌దారులు

పింఛన్ల పంపిణీలో రాజకీయ రంగు

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద అందజేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం కాస్తా టీడీపీ కార్యక్రమంగా మారిపోయింది. మండలంలోని కోడుమూరు, వెంకటగిరి గ్రామాల్లో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలోనూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్ల అందజేశారు. కోడుమూరు సర్పంచ్ భాగ్యరత్న, రిటైర్డ్ ఎస్ఈ అమడగుంట్ల క్రిష్టారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేఈ మల్లికార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలో 9106 మంది పింఛనుదారులకు గాను సోమవారం సాయంత్రానికి 8126 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ దివ్య తెలిపారు.

పాణ్యంలో 95శాతం పంపిణీ

పాణ్యం: మండలంలో 6,397 మంది లబ్ధిదారులు ఉండగా సోమవారం 6067 (95శాతం) మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారుల తెలిపారు. చాలా చోట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పింఛన్లు పంచుతూ ఫొటోలకు ఫోజులిస్తూ కనిపించారు. కొన్ని చోట్లా సర్వర్ సమస్య తలెత్తడంతో లబ్ధిదారులు వేచిచూడక తప్పలేదు. పింఛన్ల పంపిణీ సరళిని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి మంజువాణి, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు.

సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పాలన అందిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 19,26,37,41వ వార్డులు, ఉలిందకొండ, తడకనపల్లె గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, కార్పొరేటర్ ఆయిషా సిద్దిఖా, టీడీపీ నాయకులు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



సి.బెళగల్: ఆంజనేయస్వామి ఆలయం వద్ద పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



కల్లూరు: పింఛన్ పంపిణీ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



గూడూరు: గుడిపాడులో పింఛన్‌ను అందిస్తున్న మండల ప్రత్యేకాధికారి సునీల్ కన్నా



కోడుమూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

డయేరియాపై అప్రమత్తత అవసరం

- డీపీఎంఓ డాక్టర్ ఉమా

కల్లూరు: డయేరియా నివారణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీపీఎంఓ డాక్టర్ ఉమా అన్నారు. సోమవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ''స్టాప్ డయేరియా'' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షా కాలంలో నీరు కలుషితం కావడం వల్ల ప్రజలకు వాంతులు, విరేచనాలతో అనారోగ్యానికి గురి అయ్యే అవకాశముందన్నారు. నీరుకాచి చల్లార్చి వడబోసి తాగాలని, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. పీఓ ఆర్‌బీఎస్‌కే హేమలత మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, చేతుల పరిశుభ్రత, తాగునీటి అవశ్యకతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, హెచ్ఈఓ శ్రీనివాసులు, డీపీఓ విజయ రాజు, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ ఉమా



గూడూరు పీహెచ్‌సీలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

డయేరియాపై అవగాహన అవసరం

గూడూరు రూరల్: డయేరియాపై ప్రజలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రత్యూష అన్నారు. గూడూరు పీహెచ్‌సీలో సోమవారం డయేరియా నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రెండు నెలల పాటు ప్రతి రోజు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో పర్యటించి డయేరియా, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటిని కాచి చల్లార్చిన తర్వాత తాగాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అర్ఫాన్‌బాషా, క్రిష్టారెడ్డి, రామకృష్ణయ్య, రాఘవయ్య పాల్గొన్నారు.



గడివేములలో భారీ వాహనం వెళ్తుండగా పైకిలేచిన దుమ్ము

దుమ్ముతో నరకం

గడివేముల: మండల కేంద్రం గడివేములలో భారీ వాహనాల రాకపోకల సమయంలో ఏర్పడే దుమ్ముతో వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ భారీ వాహనాలు గడివేములలో వెళ్తున్నప్పుడల్లా పెద్ద ఎత్తున దుమ్ములేస్తోంది. అనుమతి లేకున్నా గ్రామంలోకి భారీ వాహనాలు రావడంతో దుమ్ములేచి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి తలెత్తుతోందని స్థానికులు చెబుతున్నారు. దుమ్ము తీవ్రతతో వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్న వారు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికారులు స్పందించి భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయాడు



రోడ్డు మధ్యలో ఆగిపోయిన కంటైనర్



విరిగిన చక్రాల డిస్క్

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో సర్వీస్ రోడ్డు అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. గుంతలు తెలియక చాలా మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. సోమవారం చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ కంటైనర్ డ్రైవర్ ఫ్లైవర్ దిగి సర్వీస్ రోడ్డుపైకి వచ్చాడు. రోడ్డుపై నీరు ఉండడంతో గుంతలు గమనించక కాస్త వేగంగా వాహనాన్ని నడిపాడు. దీంతో లోడ్‌తో ఉన్న కంటైనర్ చక్రాల డిస్కులు విరిగి అక్కడే ఆగిపోయింది. పాణ్యంలోకి వచ్చే బస్సులు, లారీలు, ఇతర వాహనదారులు ఈ రోడ్డులో వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఆసుపత్రిలో పారిశుద్ధ్యం లోపించకూడదు

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుద్ధ్య లోపం కనిపించకూడదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన ఎంసీహెచ్, ఔషధశాల, ఎఫ్ఎం–4, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్, క్యాజువాలిటీ విభాగాలను సందర్శించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులతో సమన్వయం చేసుకుని శానిటేషన్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంసీహెచ్ బ్లాక్ వద్ద నీరు నిలిచి ఉండకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు రూ.10లక్షల అంచనా అవుతుందని ఇంజినీర్లు చెప్పారని తెలిపారు. అండర్‌గ్రౌండ్ ఆల్టర్నేటివ్ కేబుల్స్‌కు రూ.80లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఏపీఎస్ పీడీసీఎల్ పవర్ 1000 హౌస్ దగ్గర గతంలో 8 మంది సిబ్బంది పనిచేసేవారని, వీరిని గతంలో తొలగించారన్నారు. ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారని, పాతవారికి అదనంగా మరో ముగ్గురు సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకోవడానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఏఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది ఉన్నారు.



పారిశుద్ధ్య పనులపై సూచనలు చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి

అంటు వ్యాధుల నివారణకు చర్యలు

కర్నూలు సిటీ: వర్షాకాలంలో ప్రబలే అంటు వ్యాధుల నివారణకు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధికారులకు ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే స్థానిక తన స్వగృహంలో అతిసార నియంత్రణ మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.విజయ మాధురి, డా.మంజూష పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్మికులతో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఏదైనా గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే వెంటనే అక్కడ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌కు 256 క్యూసెక్కులు విడుదల

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు సోమవారం 256 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు. రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని.. ప్రస్తుతం రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేశామని పేర్కొన్నారు.

ఘనంగా కర్నూలు ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు సిటీ: కర్నూలు జిల్లా ఆవిర్భావ దిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. జిల్లా మేధావుల వ్యవస్థ ఆధ్వర్యంలో సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో వేడుకలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి. సుబ్రహ్మణ్యం కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కె.చంద్రశేఖర్ కల్కూర ముఖ్య అతిథిగా, కర్నూలు జిల్లా మేధావుల వేదిక వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రెహమాన్ గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి 57 సంవత్సరాల ముందే కర్నూలులో మూడు గొప్ప తిరుగుబాటు ఉద్యమాలు జరిగాయన్నారు. 1954 సంవత్సరంలో మొదటిసారిగా ప్రవేశ పెట్టిన పద్మ పురస్కారాలను జిల్లా నుంచి విద్యావేత్తగా ఆచార్య లక్ష్మణస్వామి మొదలియార్, రాజనీతి శాస్త్రవేత్తగా ఆర్కాట్ రామస్వామి మొదలియార్, పారిశ్రామికవేత్తగా మాచాని సోమప్ప అందుకున్నారన్నారు. ఈ అరుదైన గౌరవం కర్నూలు జిల్లాకే దక్కిందన్నారు. 1858 జూలై 1వ తేదీన 8 తాలూకాలతో కర్నూలు జిల్లా అవతరించిందన్నారు. రెండేళ్ల క్రితం జిల్లాల పునర్విభజన చేయడంతో కర్నూలు, నంద్యాల జిల్లాలుగా విభజితమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా.బి.ఆర్. ప్రసాద్ రెడ్డి, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ బి.ఎస్. రామయ్య, రచయిత అజీజ్, ఆంగ్ల అధ్యాపకురాలు డా.హెచ్ అక్తర్ భాను, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ కల్కూర

సమస్యల పరిష్కారమే లక్ష్యం

సి.బెళగల్: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల అధికారులు పనిచేయాలని తహసీల్దార్ అనుపమ ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కంబదహాల్, ఇనగండ్ల తదితర గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. అదేవిధంగా కొండాపురం, బురాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన ప్రజలు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. వచ్చిన వినతులపై విచారణ చేసి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కొందరు అధికారులు ఆలస్యంగా రావడం, మరికొందరు ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు కావడంపై మండిపడ్డారు. మరోసారి పునరావృతం అయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, ఎంఈఓ జ్యోతి, ఏఓ మల్లేషుకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్

4న పాఠశాలల బంద్‌ను జయప్రదం చేద్దాం

గూడూరు రూరల్: నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఈ నెల 4న చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ కోరారు. సోమవారం గూడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. వైద్య సీట్ల భర్తీకి నిర్వహించే నీట్‌లో అవకతవకలు జరగడం వల్ల ఎంతో మంది విద్యార్థులు నష్టపోయార ని తెలిపారు. నీట్‌ను నిర్వహించే ఎన్‌టీఏను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 4వ తేదీ ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉన్న విద్యా సంస్థలు బంద్ పాటించాలని కోరారు.

ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి

కర్నూలు(అర్బన్): జీవిత బీమా సంస్థలో పనిభారాన్ని తగ్గించేందుకు, పాలసీ సేవల్ని మరింత సంతృప్తికర స్థాయిలో అందించేందుకు నియామకాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఏఐ ఐఈఏ ఉద్యోగుల సంఘం కర్నూలు బ్రాంచ్ కార్యదర్శి సునీయకుమార్ కోరారు. సోమవారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) 74వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో అధ్యక్షుడు మక్బూల్ అహమ్మద్ పతాకాన్ని ఆవిష్కరించారు. అధికారుల స్థాయిలో రిక్రూట్‌మెంట్ జరుగున్నా 3,4 తరగతుల సిబ్బంది నియామకాల్లో నిర్లిప్తత నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.